# ఊహాలు లేపిన కల్లోలం

వడ్లపట్ల దయానందం

చక్కని ఆ రాత్రి చిక్కని వెన్నెల బయట కాస్తోంది కడిగిపెట్టిన వస్తువులా శుభ్రంగా ఉన్న ఆకాశంలో స్వచ్ఛంగా మెరుస్తున్న నక్షత్రాలు నవ్వుతున్నట్టున్నాయ్ చంద్రుడు మట్టుకు ఒక వెలుగు ముద్దలా అలా స్తబ్ధుగా పడి ఉన్నాడు మేఘాలు చెలియల్లా చుట్టూ చేరి ఉంటే వారితో సరసాలాడుతూ ఉషారుగా ఉండేవాడేమో?

ఆ యింటికి దొడ్డివైపున పూలమొక్కల మధ్య కుర్చీలో కూర్చున్నాడు ప్రస్తుతం ఆ యింట్లో ఉంటున్నది అతనొక్కడే

హొటల్ మెతుకులు పగలంతా ఆఫీసు పని ...రాత్రి ఈ వంటరితనం ...తలుచుకుంటే అతనికి జీవితం మీద ఎంతో భయమేసింది బ్రతుకంతా ఎప్పుడూ ఇలా ఐపోతే? అతనికి వళ్ళు జలదరించింది ఉత్త అర్ధంలేని ఊహ.

అతను అసలే అదొక తరహా మనిషి బ్రతకవలసిన ఖర్మయోగాన్నుంచి తప్పించుకోవడం మనుషులకి చేతనైతే, ఇన్ని కోట్ల మంది అసలు మనుషులుగా బ్రతికుండేవారు కారన్నది అతని విశ్వాసం. మనిషి బ్రతుక్కి మధురమైన అర్థాన్ని చెప్పకునేటంత ఘోరం మరొహటేదీ ఉండదన్నది అతని తత్వం ఏ మనిషి చచ్చినా దానివల్ల మనకి వ్యక్తమయ్యే దేవిటంటే—

''ఇదుగో ఈ చచ్చిన మనిషి ఎదుర్కొన్న కష్టాల్ని....పడ్డ బాధల్ని....మనుషులనుభవించ వీలగు కష్టాల్లోనూ బాధల్లోనూ క్రొత్తగా చేర్చుకో వచ్చు'' అన్నది. చచ్చిన మనుషుల జీవితాల్నుంచి ఇంతకంటే నేర్చుకోతగ్గ నిజం మరొహటుండదన్నది అతని ఊహ. తన ఊహలూ విశ్వాసాలూ నిజం కావేమో ననుకున్నప్పుడు తన జీవితాన్నే ముందు వాటికి అన్వయించి చూస్తాడు....దానితో తన విశ్వాసాలన్నీ పచ్చి యదార్థాలన్నది అతనికి బోధపడిపోతుంది. అందులోనూ తనలా బ్రతగ్గలుగుతుంది నూటికి పదిమందైనా ఉండరు....అట్టి స్థితిలో మిగిలిన అసంఖ్యాకుల బ్రతుకుల్ని గురించి ఆలోచించేందుకే గుండె ధైర్యం చాలదు

బ్రతకడానికి సంపాదన ఉండాలి. తప్పదు దాని కోసం రోజుకి పదిగంటలు ప్రత్యక్షంగా చెయ్యవలసిన కృషి.. పోతే విశ్రాంతికి ఎనిమిది గంటల అవసరం తదితర దిన కృత్యాలకిగాను మరొక మూడు గంటలు....ఈ కార్యకలాపాల నిర్వహణలో విధిగా వ్యర్థపఱచుకోవలసివచ్చే కాలం కొంత... అంతా కలిపితే ఇరవైనాలుగు గంటల దరిదాపులకి వస్తుంది అయితే ఇక మనిషి ఆశించతగు సుఖం ఏవిటీ విసుగూ విరామం లేకుండా తిరిగి పోయేదైనమో?....అదైనా నయం ఆఫ్ చేసినప్పుడు విశ్రాంతి తీసుకుంటుంది మనకి ప్రాణం ఉంటుంది కనుక ఎప్పటికప్పుడు వర్తమానంలో బాధపడుతూ, భవిష్యత్‌ని తలుచుకుంటూ, ఏదో తృప్తి పడుతూంటాం....అలా చచ్చేవఱకూ భవిష్యత్‌ని గూర్చి తీయని కలలుకంటూనే ఉంటాం.... తీరా పుట్టాక చావనేది మన చేతిలో ఉండదు కనక బ్రతుకనే బాధ

సర్వసామాన్యమైనదై....దానిలోనే ఏవో సుఖాలని కల్పించుకుంటూ మురిసిపోతాం.

వయస్సు పాతిక సంవత్సరాలుంటుంది. ఆ వయసులోనే హెడ్‌క్లర్క్ అయిన అతనికి చక్కని భవిష్యత్తే ఉండవచ్చు. కాని అతని మనసు ప్రమోషన్లమీద ఉండదు. అసలు దేనిమీదా ఉండదు....ఒక్క భార్యమీద తప్ప అతను భార్యకి మనసులోనే ఎన్నో ధన్యవాదా లర్పించుకుంటాడు. నిస్సారంగా తోచే తన బ్రతుక్కి ఆ అమ్మాయి ఏదో వెలుగు చూపించేదిగా కన్పిస్తుంది నిజానికి అటువంటి అమ్మాయి తనకి భార్య అయి ఉండకపోతేనా....అసలు ఏ నాడో ఏమైపోయి ఉండేవాడో. తనని భర్తగా హృదయపూర్వకంగా స్వీకరిస్తూ ప్రేమతో లాలనగా చూచే ఆ పిల్ల చూపులు నిజంగా తనని బ్రతికేట్లుచేస్తున్నాయ్ తన ముఖంలో అప్పుడప్పుడూ ఆనంద రేఖ లుదయింపచేస్తున్నాయ్. అసలు తనని బ్రతికించడానికే ఈ పిల్ల రాసి పుచ్చుకు పుట్టి తనకి భార్య అయిందా అన్న సందేహం కూడా కలుగుతూంటుంది. ఏంచేసినా తనని సంతోష పెట్టడానికే. ఏచీరకట్టినా....ఏ కూరవండినా.. ఒకటనేమిటి—సర్వం తననే దృష్టిలో పెట్టుకు చేస్తుంది.

ఏనాడైనా తను నిరుత్సాహంగా కన్పిస్తే నవ్వుతూ తన ప్రక్కన చేరి ప్రపంచాన్నే జయించగల శక్తి స్వరూపిణిలా కన్పిస్తూ.... తన కెంతో ధైర్యాన్ని ఉత్సాహాన్ని కల్గిస్తుంది. ఆ అమ్మాయి అనురాగాన్ని తను పొందగలగటమే తన బ్రతుక్కి అండగానూ ధైర్యంగానూ ఉండి కవచం ధరించిన వాడిలా మనగలుగుతున్నాడు....లేకపోతేనా?

ఇప్పుడా అమ్మాయి ఇంట్లో లేదు. నెల రోజుల్నుంచి ఆ అమ్మాయి ఆ ఇంట్లో ఉండటం లేదు పురుడు పోసుకోడానికి పుట్టింటి కెళ్ళింది ఈ నెల రోజుల్లోనూ దాదాపు పదిహేను ఉత్తరాలు రాశాడు రోజు విడిచి రోజు తన ఉత్తరం అక్కడా అమ్మాయి చదువుతుంది ...అది నిజంగా తన కెంత సంతృప్తి. అప్పుడప్పుడూ సమాధానం వ్రాస్తుంది. తనుండవలసిన విధానాలనిగురించి లక్షా తొంభై హెచ్చరికలు ఏవిటో తనపై ఆ పిల్ల బాధ్యత.... తన మీద సర్వాధికారాలూ ఆమెవే నన్నట్టు వ్యవహరిస్తుంది. చంటిపిల్లాడిని గురించి జాగ్రత్తలు తీసుకున్నట్టు తీసుకుంటుంది....తను లేకపోతే కనీసం బీరువాలో గుడ్డలైనా తీసుకు తొడుక్కోవడం చేతగానట్లనుకుంటుంది ఆ అమ్మాయి లేకపోతే ఆఖరికి తనకి భోజనం చెయ్యడం కూడా చాతనవ్వదన్నట్టు భావిస్తుంది....నిజానికి తన స్థితి సైతం అంతేలే.... ఇంతకీ తను తండ్రికాబోతున్నది ఆడపిల్లకో మగ పిల్లాడికో ఇవ్వాళో రేపట్లో తెలిసిపోవాలి మరి....అందుకే అతనికి మనసులో మరింత గందరగోళం లేచింది. తుఫాను రోజుల్లో చావు బతుకుల మధ్య కొట్టుకులాడే దిక్కులేనిపక్షిలా ఉంది అతని మనసు అందులోనూ ఇవ్వాళ సాయంత్రం ఆఫీసున్నుంచి వస్తూండగా జనరల్ హాస్పటల్‌నుంచి స్త్రీ శవాన్ని బండిలో వేసుకు పోవడం చూచాడు వద్దనుకున్నా ఆ మరణాన్ని గురించి వాకబు చెయ్యకుండా ఉండలేకపోయాడు పురిటిచావన్నది తెలిసినతర్వాత ఎందుకో అతని మెదడు మొద్దుబారినట్లైపోయింది. చటుక్కున అతని భార్య గుర్తుకొచ్చింది. అక్కడ నుంచి ఎంత నిగ్రహించుకుందామనుకున్నా అన్నీ శంకతో కూడుకున్న ఆలోచనలే. సాయంత్రం నించీ మరీ ఒడ్డున పడ్డ చేపలా ఐపోతోంది అతని పని

రాత్రి పదకొండయింది అతను అలానే కూర్చుని ఆకాశంలోకి చూస్తూ ఏవో పిచ్చి ఆలోచనలతో ఉండిపోయాడు నెల్నాళ్ల క్రితం తనని విడిచి బండెక్కబోతున్న ఆ అమ్మాయి దృశ్యమే తన దృష్టిని కప్పివేస్తోంది.

"నే వెళ్ళొస్తాను జాగ్రత్తగా ఉంటారు కదూ?" నే లేకపోయింతర్వాత మీ కింక జాగ్రత్తేమిటిలెండి, ఏదో మాటవరస కంటున్నా కాని—అన్న భావాన్ని వ్యక్తపరుస్తూ అన్నదా మాట. తనకి ఏమీ తోచక వెళ్ళి గదిలో మంచం మీద దిగులుగా పండుకున్నాడు

మెల్లగా అక్కడికొచ్చింది-"ఎంతండీ ఒక్క నెల రోజులు....తప్పదుగా మరి .. వెళ్ళిరానా"

బుజ్జగిస్తున్నట్లుంది, తన కళ్ళల్లోకి లాలనగా చూస్తూ ఎందుకో ఆచక్కని లేచిగురుటాకుల్లాంటి పెదాలమీద చిఱునవ్వు లాస్యం చేసింది. కళ్లల్లో చిలిపితనం...మనసులో ఏమూహించుకొంటున్నదో ఏమో....సిగ్గుతో కెంపుబారాయి చెక్కిళ్ళు....

మాతృమూర్తిని కాబోతున్నానన్న అహం భావం....మిమ్మల్ని విడిచివెళ్ళడానికి నిజానికి మీకంటే నాకే మనసొప్పడంలేదన్న భావానికి ప్రతిరూపంగా ఉదయించిన చిరుసిగ్గు....తనలో నూరొవ వంతైనా నిగ్రహక శక్తి ప్రదర్శించలేక అలా బయటిపోతున్న తనస్థితిపట్ల కొంటెతనం.. వెరసి ఆ అమ్మాయి రూపం తనని కవ్వించి హెచ్చరించినట్లయింది. ప్రయత్నంమీద చిరునవ్వు తెచ్చిపెట్టుకుని లేచి నిలబడ్డాడు తను.

''ఊ....వెళ్ళిరా....''

తన మాట పూర్తికాక ముందే సిగ్గుతో ముఖాన్ని తన గుండెల్లో దాచుకోబోయింది. దగ్గరకి రాబోయింది....కాని ఇద్దరికీ మధ్య అడ్డుగా వారిస్తున్నట్టున్న గర్భంలోఉన్నబిడ్డ... చటుక్కున అంత దూరంలోనే ఆగిపోయి వెను దిరిగింది....అప్పుడే ఏదో అపశృతిలా గోచరించింది తనకి

ఆలోచనల మధ్య అతన్ని తీతూ పిట్ట అరుపు మేల్కొలిపింది ధూ....థూ....అనుకుంటూ లేచి నిలబడ్డాడు. వీధిలోకి నడిచి ఆ వెన్నెల్లో అటూఇటూ పచార్లు మొదలుపెట్టాడు

అలా ఎంతోసేపు తిరిగాడో ఏమో....ఇంతలోనే తన ప్రక్కన ఏదో సైకిలాగిన చప్పుడై తిరిగి చూచాడు

"ఏవండీ . చలపతిరావుగారంటే ఎవరండీ?"

అతని గుండె లాగిపోయినంత పనైంది తను కేవలం సాధారణ మానవుడు కాదు.... అసాధారణ వ్యక్తి....భవిష్యత్‌ని చూడగల మహత్తర శక్తి తనలో ఉంది. ఆ అడిగినతనూ అంతే. మామూలు మనిషి కాదు....తన భార్య ప్రాణాలు తీసుకుపోతూ కబురు చెప్పడానికి వచ్చిన యమభటుడు....ఆ ఎఱ్ఱ సైకిల్.... కాకీ డ్రస్సు....పైపెచ్చు చావు కబురు చెప్పడానికి సరాసరి తనదగ్గరకే వచ్చి తనపేరడగటం ..

''ఎక్కడనుంచీ టెలిగ్రాం?''—నాలిక తడి చేసుకు నడిగాడతను.

''రాజమండ్రి నుంచండి''—

ఇకా టెలిగ్రాం తీసుకోవలసిన పనిలా.... చదువ్వలసిన పనిలా...తనఊహలన్నీ యదార్థ రూపం ధరించేయ్ .... ఇప్పుడే ఆలోచనలూ లేవతని బుర్రలో .... అదొకలా మత్తు కలిగినట్లయిపోయింది. తిరిగి ఆలోచనలు ప్రారంభించేసరికి....అతను తెలుసుకున్నాడు — తను రోడ్డుమీద చతికిలపడున్నాడు....సైకిల్‌కి స్టాండేసి.. .టెలిగ్రాం బంట్రోతు తన చెవులు మూస్తున్నాడు ఇతని పిచ్చిగాని ఆ మాట తనకి వినిపించకపోతుందా తెలియకపోతుందా, చెవులు మూసినంతలో.

''ఏవిటండీ ఇలా ఐపోతున్నారూ?'' ఖంగారుగా అడిగినాడు.

''ఏఁవీలేదు తల తిరిగినట్టయింది ''

చేతులు వణుకుతూంటే సంతకం ఎలానో చేసి తీసుకుని....దానిలోఉన్న విషయం ఒక్కసారిగా చూద్దామన్నంత ఆత్రంతో చూచి తెలుసుకున్నాడు

తన ఊహలన్నీ వచ్చి యదార్థం ..టెలిగ్రాం సంప్రదాయ ప్రకారం సీరియస్ అని ఇచ్చారు కాని....నిజంగా పోయేఉంటుంది....తనభార్య ఆ అమ్మాయ్....అబ్బా... తను భరించలేడా బాధ....ఇంత దారుణమైన వార్త తెలియక ముందు తనే చచ్చిపోయినట్టయితే ఎంత బాగుండేది....అతని ఆలోచనలన్నీ స్థంభించిపోయాయ్....మెదడంతా రాయిలా మారినట్టయిపోయింది

తెల్లారి ప్రొద్దున్న కలకత్తా మెయిల్‌కి బయలుదేరా డతను. మనిషి పిచ్చాడిలా ఉన్నాడు....కళ్ళురెండూ వాచి ముఖమంతా ఉబ్బిపోయినట్టుంది .... తనెందుకు బయలు దేరిందీ అతనికే అర్థంకాదు ప్రాణంలేకుండా పడిఉండే ఆ అమ్మాయి దేహాన్ని చూడలేడు తను....అయినా ఎందుకో బయలుదేరాడు

అసలా అమ్మాయి తనకి భార్యకాకుండా ఉంటే తనేమైనా బాధపడవలసి వచ్చేదా ఇలా ఒకమ్మాయి ఈ ప్రపంచంలో కొంతకాలం జీవించి చనిపోయిందన్న విషయమైనా తనకి తెలిసేదా....ఎంతోమంది చస్తూంటే లేనిబాధ ఈ అమ్మాయిపోతే ఎందుకు కలుగుతోంది?....

ఈ ప్రశ్నకి సమాధానం అనూహ్యంకాదు

ఆ అమ్మాయివల్లే బ్రతగ్గలుగుతున్నాడు తను....ఆ అమ్మాయి తన భార్య .. ప్రపంచంలో మరి ఏ యితర మనిషితోనూ తనకంత సన్నిహితత్వం ఉండదు . .తల్లిదండ్రులు. . అన్నా చెల్లెళ్లు....తదితర బంధువర్గం జీవితంలో బహు కొద్దికాలమే కలసి ప్రయాణం చేసేది .... జీవితాంతంవరకు కలసి ప్రయాణించేది భార్యా భర్త లిద్దరే .. సోదరుడుపోతే మరొహ సోదరుణ్ణి తెచ్చుకోలేం భార్యపోతే మరొహ భార్యన్ని తెచ్చుకోవచ్చును గదా

కాని నిజమైనమనిషి అలా భార్యని సైతం తెచ్చుకోలేడు....బ్రతికున్నంతవరకు ఆ మమకారాన్ని చంపుకోలేడు....ఆ అమ్మాయే తన సర్వస్వమూను....ఆ అమ్మాయిలేని ప్రపంచానికి తనదృష్టిలో అర్థమేముందసలు? అతను బండిదిగి వడివడిగా ఇంటివైపుకి అడుగు లేస్తున్నాడు.. .మనసు అంత వేగంతోనూ వెనక్కి లాగుతోంది....ఇప్పుడు తను చూడవలసిన దృశ్యం....దాని తలుచుకుంటుంటేనే గుండె లాగిపోతయ్యేమోనన్న అనుమానం....

అదిగో కనుచూపుమేరలో కన్పిస్తోంది తన మావగారిల్లు తను ఆ సందుకే తిరిగాడు ఇంటి ముందు జనం ఎవరూ ఉన్నట్టు లేరేవిఁటి?... తలుపులు కూడా వేసేసినట్టుంది....ఒకవేళ దహనపరిచేయడం సైతం జరిగిపోయిందా... గుండెల్ని ఎవరోపట్టి మెలిపెట్టేస్తున్నట్టయిపోయినది ఇల్లు సమీపిస్తున్నకొద్దీ విపరీతమైన శబ్దంతో విపరీత వేగంతో గుండెలు కొట్టుకుంటున్నాయ్.

మెల్లగా అతను తలుపు ముందర నిలబడ్డాడు. పిలవడానికి నోరురావడంలా. లోపల శబ్దా లేవైనా వినిపిస్తాయేమోనన్న ఆశ....అలా శబ్దాన్ని గ్రహించగల శక్తి తనలో నిండుకున్న అనుమానం అయినా ఏదో సన్నగా ఏడ్పు లాంటిది వినిపిస్తోంది. మెల్లగా తలుపుతోశాడు. తలుపులు తెరచుకున్నాయ్

ఎదురుగుండా....ఆ దృశ్యం.

అతని గుండె లాగిపోయినంత పనయింది. తనకళ్ళని తనే నమ్మలేక పోతున్నాడు. ఇదంతా కేవలం తన భ్రాంతి. లేకపోతే.. .చనిపోయిన తన భార్య అలా చిరునవ్వులతో తన ముందు నిండుగా నిలబడి ఉండటం ఏవిఁటి? అనుమానంతో ఆశ్చర్యంతో అలా నిర్ఘాంతపోయి చూస్తూ ఉండిపోయాడు....

భర్తచూపుచూచి విస్మయపడిన ఆ అమ్మాయి ముందుకొచ్చి... ''ఏవిటండీ ఇదేనా రావడం . అలా వున్నారేం... వొంట్లో బావుండటంలేదా? ముందుత్తరంలో నైనా తెలియపర్చలేదేం?''— అంటూ పలకరించింది.

అతను సంతోషంతో ముందుకు దూకి ... ఆ అమ్మాయిని దగ్గరకి తీసుకుని ఆ అమ్మాయి నిజంగా ఆ అమ్మాయే అన్నది నిర్ధారించుకున్నాక ఎంత ఆనందపడ్డాడో చెప్పలేం. ఒక్కక్షణంలో ఈ ప్రపంచమంతా విచ్చుకున్న నూరువరహాల పూలమొక్కలా అన్పించింది.

"ఊహు.. అదికాదు. . మరి ఈ టెలిగ్రాం ఎందుకిచ్చినట్టు? లోప లెవరో ఎందు కేడుస్తున్నట్టు?'' ఎదర జేబులోంచి కాగితంతీసి భార్యచేతికిస్తూ తడబడుతూ అడిగా డతను. ఆ అమ్మాయి పక్కున నవ్వేసి ''ఏడ్పుకాదండీ మీ మరదలు కూనిరాగం'' అని టెలిగ్రాం కాగితం అందుకుని చదివి ఒక్కక్షణం ఆలోచించింది .... తర్వాత కళ్ళు తిప్పుకుంటూ అంది -

''ఓహో.. .ఇదా....మన సందులో లెక్చరర్ చలపతిరావుగారు లేరటండీ ... ఆయన భార్య ఇక్కడే శానిటోరియంలో ఉంటోంది లెండి....బహుశా ఆయనకై ఉంటుంది.''

''అరె....రే....పాపం....'' అనుకుంటూ అతను ఆదరాబాదరా అంత ఖంగారుతోనూ తిరుగుప్రయాణమైపోయాడు. ★